క్లుప్తంగా

ఘనంగా యోగి వేమన జయంతి



యోగి వేమన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

తలుపుల : విశ్వకవి యోగి వేమన జయంతి మంగళవారం తలుపులలోని మూడు రోడ్లకూడలిలో ఘనంగా జరిగింది. ప్రజాసంగాల నాయకులు వేమన చిత్ర పటానికి పూలమాలలు వేసి, కొబ్బరికాయలు కొట్టి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎద్దులరాముడు, కిట్టు, భూషణ, శంకర, హమాలీలు, ఆటో డ్రైవర్లు, పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ



రాజప్ప మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న గోరంట్ల మాధవ్

రామగిరి: మండలంలోని గంతిమర్రి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత గొల్లరాజప్ప (52) మంగళవారం అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికారప్రతినిధి గోరంట్లమాధవ్ గ్రామానికి చేరుకుని గొల్లరాజప్ప మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి భార్య రామలక్ష్మి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాజప్ప కుటుంబానికి పార్టీ అన్నివిధాలుగా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ చెన్నకేశవరెడ్డి, ఎంపీటీసీ కొండన్న, నాయకులు పాల్గొన్నారు.

రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరి



రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఏడీఏ సత్యనారాయణ

ఎన్‌పీకుంట: భూమి కలిగిన ప్రతి రైతూ రైతు సేవ కేంద్రంలో రిజిస్ట్రీ (విశిష్ట గుర్తింపు) సంఖ్య కోసం తమ వివరాలు నమోదు చేసుకోవాలని ఏడీఏ సత్యనారాయణ సూచించారు. వంకమద్ది గ్రామంలో మంగళవారం మండల వ్యవసాయ అధికారి లోకేశ్వర్‌రెడ్డి, రైతులతో కలిసి 'పొలంబడి' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేలైన యాజమాన్య పద్ధతుల ద్వారా ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తులను పండించడం, నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ ప్రజల ఆరోగ్యం కాపాడటం కోసం రసాయన పురుగుల మందులను అవసరం మేరకే వినియోగించి పండించిన ఉత్పత్తులకు 'ఇండీ గ్యాప్ సర్టిఫికేషన్' ద్వారా ధ్రువీకరణ చేసి అధిక ధరలకు మార్కెటింగ్ సౌకర్యాన్ని రైతులు పొందాలని వివరించారు. అనంతరం ఎన్‌పీ కుంట రైతుసేవ కేంద్రంలో విశిష్ట గుర్తింపు రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఏడీఏ పరిశీలించారు. కార్యక్రమంలో ఏఓ లోకేశ్వరరెడ్డి, వీఏఏలు, వీహెచ్‌ఏలు, రైతులు పాల్గొన్నారు.

22, 23 తేదీల్లో రైల్వే గేట్ మూసివేత



మూసివేయనున్న రైల్వే గేటు

ముదిగుబ్బ: ముదిగుబ్బ నుంచి పుట్టపర్తి వైపు వెళ్లే రైల్వే గేటును ఈ నెల 22, 23 తేదీల్లో మూసివేయనున్నట్లు రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజినీర్ అప్సర్‌బాషా మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ రెండు రోజులపాటు గేటు మరమ్మతు పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ దారిగుండా వెళ్లే వాహనదారులకు ప్రత్యామ్నాయ దారి చూపాలని పోలీస్ అధికారులకు విన్నవించామన్నారు. వాహనదారులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

మొక్కజొన్న తోట దగ్ధం

చెన్నేకొత్తపల్లి: న్యామద్దెల సమీపంలో జరిగిన అగ్ని ప్రమాదంలో మొక్కజొన్న తోట దగ్ధమైంది. బాధితులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన వరలక్ష్మి సుమారు రెండున్నర ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. ప్రస్తుతం పంట కోత దశలో ఉంది. మంగళవారం మధ్యాహ్నం పొలం సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు ఎండుగడ్డికి నిప్పు పెట్టారు. మంటలు తీవ్రమై పక్కనే ఉన్న మొక్కజొన్న తోటకు పాకాయి. చుట్టుపక్కల ఉన్న రైతులు గమనించి రైతులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకుని లోపు పంట మొత్తం కాలి బూడిదైంది. పక్కనే ఉన్న మరో రైతు లక్ష్మీనారాయణ పొలంలో డ్రిప్ పరికరాలు కాలిపోయాయి. ఘటనలో దాదాపు రూ.3 లక్షల వరకూ నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు వాపోయారు.

రైతుల ప్రయోజనాలు ఎక్కడ?



ఉప్పునేసినపల్లి వద్ద ప్రారంభానికి నోచుకోని గోదాము



గొట్లూరు వద్ద నిరుపయోగంగా ఉన్న గోదాము



- వ్యవసాయ రంగంపై సర్కారు చిన్నచూపు
- ఎనిమిది నెలల కిందటే గోదాములు పూర్తి
- ప్రారంభించడానికి అధికారులకు తీరికేదీ?

ధర్మవరం రూరల్: వ్యవసాయం రంగంపై కూటమి సర్కారు చిన్నచూపు చూస్తోంది. రైతు ప్రయోజనాలు పట్టడం లేదు. గత ప్రభుత్వంలో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన భవనాలను ప్రారంభించడానికి పాలకులకు తీరికే లేకుండా పోయింది. అప్పట్లో రైతులు పండించిన పంటలను మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేని సమయంలో ఈ గోదాములలో నామమాత్రపు రుసుం చెల్లించి నిల్వ ఉంచుకునేందుకు వీలుగా ఏడీసీసీ బ్యాంకు నిధులతో బహుళ ప్రయోజనార్థం గోదాముల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా ధర్మవరం మండలం ఉప్పునేసినపల్లి వద్ద రూ.44 లక్షలు, గొట్లూరులో రూ.88 లక్షల నిధులతో గోదాములు నిర్మించారు. ఎనిమిది నెలల కిందటే పనులు పూర్తయ్యాయి. అయితే వాటిని ప్రారంభించి రైతులకు అందుబాటులోకి తెద్దామనే ఆలోచన ఇటు పాలకులకు గానీ, అటు అధికారులకు గానీ లేకుండా పోయింది. దీంతో గోదాములు నిరుపయోగంగా మారాయి.

ధాన్యం నిల్వకు అనుకూలం

వ్యవసాయ గోదాముల్లో వేరుశనగ, కంది, వరి ధాన్యం తదితర వాటిని ఆరబోసుకొని.. నిల్వ చేసుకునే అవకాశం ఉంది. అందుకు గాను గొట్లూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి నామమాత్రపు రుసుం చెల్లించాల్సి ఉంటుంది. గొట్లూరు, బడన్నపల్లి, గొళ్లపల్లి, మల్కాపురం, నాగలూరు గ్రామాల పరిధిలోని రైతుల కోసం గొట్లూరులో నిర్మించిన గోదాము సౌకర్యంగా ఉంటుంది. అదే విధంగా ఉప్పునేసినపల్లి, చిగిచెర్ల, చింతలపల్లి, గరుడంపల్లి, వసంతపురం తదితర గ్రామాల రైతులకు ఉప్పునేసినపల్లి వద్ద నిర్మించిన గోదాము సౌకర్యంగా ఉంటుంది. ఈ గ్రామాల రైతులే కాకుండా మండలంలోని ఇతర గ్రామాల రైతులు కూడా ఈ గోదాములను ఉపయోగించుకోవచ్చు.

గత ఏడాది నవంబర్, డిసెంబర్ నెలల్లో తుపాను కారణంగా వరి ధాన్యం, వేరుశనగ నిల్వలను కళ్లాల్లో ఉంచుకొని రైతులు చాలా ఇబ్బందులు పడ్డారు. వర్షాలకు తడిసి వేరుశనగకాయలు నల్లగా మారిన సందర్భాలు కూడా లేకపోలేదు. అలాంటి సమయంలో గోదాములు అందుబాటులో ఉంటే ఎంత ప్రయోజనకరంగా ఉంటాయని రైతులు చెబుతున్నారు.

ఆకతాయిలకు అడ్డాగా మారాయ్

గోదాములు నిర్మించి 8 నెలలు కావస్తున్నా వాటి గురించి అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో ఆకతాయిలు, మందుబాబులకు అడ్డాగా మారుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. లేని వాటి కోసం ఎదురు చూడడం కన్నా, ఉన్న వాటిని సద్వినియోగంలోకి తీసుకురావడంలో నిర్లక్ష్యం కనిపిస్తోందని మండిపడుతున్నారు. అధికారులు స్పందించి గోదాములను వినియోగంలోకి తెస్తే వచ్చే ఖరీఫ్ పంటలనైనా నిల్వ చేసుకునేందుకు వీలుంటుందని రైతులు చెపుతున్నారు.

గోదాములు త్వరలో వినియోగంలోకి..

రైతులు పండించిన పంట ఉత్పత్తులను నిల్వ చేసుకునేందుకు బహుళ ప్రయోజన సౌకర్య గోదాములను నిర్మించాం. ఈ గోదాములలో పంటలు నిల్వ ఉంచుకున్నందుకు గాను నామ మాత్రపు రుసుము చెల్లించాల్సి ఉంటుంది. వీటిని త్వరలో ప్రారంభించి వినియోగంలోకి తెస్తాం.

– నారాయణస్వామి, గొట్లూరు, సీఈఓ, పీఏసీఎస్

బాలుడి కిడ్నాప్ 4 గంటల్లో ఛేదింపు

- ప్రియురాలి కోసం ఆమె కుమారుడిని కిడ్నాప్ చేసిన ప్రియుడు



కిడ్నాపర్ నుంచి బాలుడిని రక్షించిన పోలీసులు

తాడిమర్రి: తనను విభేదించి దూరంగా ఉంటున్న ప్రియురాలిని తిరిగి తనతో వివాహేతర సంబంధం కొనసాగించేందుకు ప్రియుడు ఏకంగా ఆమె కుమారుడిని కిడ్నాప్ చేశాడు. ఫిర్యాదు అందిన నాలుగు గంటల వ్యవధిలోనే పోలీసులు నిందితుడి సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా లొకేషన్‌ను గుర్తించి బాలుడిని రక్షించారు. వివరాలిలా ఉన్నాయి. తాడిమర్రి మండలం నార్శింపల్లికి చెందిన ఓ మహిళ భర్తతో విడిపోయి పుట్టింటిలోనే ఉంటోంది. ఏడాది కిందట ఆమెకు కళ్యాణదుర్గం ప్రాంతానికి చెందిన రామాంజితో వివాహేతర సంబంధం ఏర్పడింది. ఏమైందో తెలియదు కానీ కొద్దిరోజులుగా ఆమె ఆ వ్యక్తితో విభేదించి అనంతపురంలో ఒంటరిగా నివాసం ఉంటోంది. తన ఇద్దరు కుమారులను నార్శింపల్లిలోని తల్లి వద్దే వదిలి పెట్టింది. ఎలాగైనా ఆమెను దక్కించుకోవాలనుకున్న రామాంజి పథకం పన్నాడు. ఆమె కుమారుల్లో ఐదేళ్ల వయసున్న ఒకరిని మంగళవారం ఉదయం పదిన్నర గంటల సమయంలో నార్శింపల్లిలో కిడ్నాప్ చేసి తీసుకెళ్లాడు. బాలుడి తల్లికి విషయం చేరవేసి, ఆమె అనుమానం వ్యక్తం చేసినట్టుగా రామాంజిపై బాలుడి అమ్మమ్మ సాయంత్రం 4 గంటలకు ఫిర్యాదు చేసింది. అప్రమత్తమైన తాడిమర్రి ఎస్‌ఐ కృష్ణవేణి వెంటనే ఎస్పీ రత్న, ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ఎస్పీ రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి రంగంలోకి దింపారు. నిందితుడి సెల్‌ఫోన్ లొకేషన్ అనంతపురం చూపించడంతో రాత్రి 8 గంటలకు అక్కడికి వెళ్లిన పోలీసులు బాలుడిని రక్షించి, తాడిమర్రి పోలీస్ స్టేషన్‌లో కుటుంబ సభ్యులకు అప్పగించారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

వీరనారాయణస్వామి గ్రామోత్సవం

బత్తలపల్లి: అప్పరాచెరువు గ్రామంలో మూడు రోజులుగా సాగుతున్న వీరనారాయణస్వామి వేడుకల్లో మంగళవారం గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. చిత్రావతి నదిలో గంగపూజ అనంతరం గ్రామానికి చేరుకున్న వీరనారాయణస్వామి ఇంటింటికీ వెళ్లి పూజలు అందుకున్నారు. అర్ధరాత్రి సమయంలో ఆలయానికి చేరుకున్న స్వామి ఉత్సవ విగ్రహాలకు మహా మంగళహారతి ఇచ్చారు. అనంతరం దాసంగం కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్చకులు వీరనారప్ప, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట

ముదిగుబ్బ: గుంజేపల్లి సమీపంలోని కన్యకలగొందిలో మంగళవారం శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. పూజా కార్యక్రమాలు బుధవారంతో ముగియనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ధర్మవరానికి చెందిన చౌటిపల్లి వేణుగోపాల్ కన్యకలగొందిలో నూతనంగా దేవాలయాన్ని నిర్మించారు. మంగళవారం సప్త శేష సుబ్రహ్మణ్యేశ్వర దేవస్థానంలో హోమాలు తదితర వాటిని నిర్వహించారు.

వైభవంగా సీతారామాంజనేయ స్వామి వార్షికోత్సవం

బత్తలపల్లి: పోట్లమర్రిలో సీతారామాంజనేయ స్వామి దేవాలయ 9వ వార్షికోత్సవ వేడుకలను గ్రామ పెద్దల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. మంగళవారం తెల్లవారుజామున నాలుగు గంటలు నుంచి దేవాలయ ప్రధాన అర్చకులు కొమాండూరు మారుతీ ప్రసాద్ పంచామృత అభిషేకం, వివిధ అర్చనలు చేశారు. ఆంజనేయస్వామి, సీతారామలక్ష్మణులు, వినాయకుడికి ప్రత్యేక అలంకరణ అనంతరం ఆకుపూజ నిర్వహించారు. భజనలు, హనుమాన్ చాలీసా పఠించారు. తెల్లవార్లు భజన నిర్వహించారు. కార్యక్రమాలలో అర్చకులు రమేష్ ప్రసాద్, సాయికృష్ణతో పాటు గ్రామ పెద్దలు, దేవాలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరికి పూజలు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కన్యకా పరమేశ్వరిదేవి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాసవీమాత ప్రతిష్ట జరిగి 23 సంవత్సరంలోకి అడుగు పెట్టిన సందర్భంగా అమ్మవారికి క్షీరాభిషేకం, అర్చనలు, పాలాభిషేకం, పంచామృతాభిషేకం తదితర పూజలు చేశారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. వాసవీ పారాయణం, లక్ష్మీ శోభాని పారాయణం ఆర్య వైశ్య మహిళలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులు జూటూరు రమణయ్య, వాసవి మహిళా మండలి అధ్యక్షురాలు పాలమడ రూపా రాగిణి, కన్యకా పరమేశ్వరిదేవి ఆలయ చైర్మన్ పిన్ను ప్రసాద్, యువజన సంఘం అధ్యక్షుడు దేవతా శ్రీనివాస్, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాలు పెంచాలి

ఎన్‌పీకుంట: పునాది దశలోనే చిన్నారులకు అభ్యసన సామర్థ్యాలు పెంపొందించేందుకు అంగన్‌వాడీ టీచర్లు కృషి చేయాలని ఎంఈఓ గోపాల్‌నాయక్ సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జ్ఞానజ్యోతి కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ టీచర్లకు 'ఎర్లీ చైల్డ్‌హుడ్ అండ్ కేర్ ఎడ్యుకేషన్'పై 6 రోజుల పాటు నిర్వహించే శిక్షణ తరగతులను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఆరేళ్లలోపు చిన్నారుల్లో ఎదుగుదల, ఆరోగ్యం, మానసిక వికాసం, విద్యాభివృద్ధి, భాషా ప్రమాణాలు పెంపొందించడంపై జిల్లా రిసోర్స్ పర్సన్లు శిక్షణ ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో డీఆర్పీలు చిన్నరెడ్డప్ప, మహేష్‌రెడ్డి, నాగేంద్ర, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు నరసమ్మ, మౌలాబీ, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

నల్లమాడ: మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు నల్లమాడలోని ఎస్టీ ఆశ్రమ పాఠశాలలో మంగళవారం శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఎంఈఓ సురేష్‌బాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సత్యవతి, హెచ్‌ఎం సతీష్ శిక్షణ ప్రాధాన్యతను వివరించారు. డీఆర్‌పీలు నరసింహులు, ఆదినారాయణ, శశికుమార్‌రెడ్డి, రామప్ప, సీఆర్‌పీలు మదర్ ఆలీ, హరి శిక్షణ ఇచ్చారు.

తాడిమర్రి: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలని కోర్సు డైరెక్టర్, ఎంఈఓ కృష్ణమోహన్ అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లలితమ్మ, చంద్రమ్మల అధ్యక్షతన జ్ఞాన జ్యోతి కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆయన ఆరు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సెకండ్ ఎంఈఓ వెంకటేష్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓడీచెరువు : అంగన్‌వాడీ చిన్నారుల్లో నైపుణ్యత పెంపే లక్ష్యంగా జ్ఞానజ్యోతి శిక్షణ ఇస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి, జీసీడీఓ సంపూర్ణ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు 'జ్ఞానజ్యోతి'పై ప్రత్యేక శిక్షణ ప్రారంభమైంది. ఎంఈఓ సురేష్, రమణ, ట్రైనర్లు రవి, లక్ష్మీనరసప్ప, అమర్‌నాథ్, రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



బత్తలపల్లిలో జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈఓలు, రిసోర్స్ పర్సన్లు

చెన్నేకొత్తపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారుల పట్ల సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంఈఓ-2 ప్రసూన్‌కుమార్‌నాయుడు సూచించారు. స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో మంగళవారం అంగన్‌వాడీ టీచర్లకు జ్ఞానజ్యోతి కోర్సుపై తొలి విడత శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

బత్తలపల్లి: బాల్యం నుంచే విద్యాభ్యాసం బలోపేతం చేయాలని మండల విద్యాశాఖ అధికారులు చాముండేశ్వరి, సుధాకర్‌నాయక్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జ్ఞాన జ్యోతి కార్యక్రమంలో భాగంగా మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆరు రోజుల పాటు శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ప్రధానోపాధ్యాయులు జయంతి, సరళ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దేవమణి, జిల్లా రిసోర్స్ పర్సన్స్ నాగేశ్వరయ్య, నాగశేషణ, రామసుబ్బారెడ్డిలు శిక్షణ గురించి వివరించారు.

పులగంపల్లిలో దారి మూసివేత

- గ్రామస్తుల ఆందోళన
- తహసీల్దార్, సీఐకి ఫిర్యాదు

నల్లమాడ: పులగంపల్లిలో పూర్వం నుంచి ఉన్న దారిని ఓ వ్యక్తి మూసివేసి రాకపోకలు బంద్ చేశాడు. దారిని పునరుద్ధరించి రాకపోకలకు అవకాశం కల్పించాలని గ్రామస్తులు ఆందోళన నిర్వహించారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ రంగనాయకులు, సీఐ నరేంద్రరెడ్డిని కలిసి వేర్వేరుగా ఫిర్యాదులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే నంబర్ 120లో తాతముత్తాతల కాలం నుంచి దారి మినహాయింపు ఉందన్నారు. ఈ దారి మీదుగానే గ్రామస్తులు పొలాలకు, చుట్టుపక్కల ప్రాంతాలకు రాకపోకలు సాగించేవారన్నారు. అయితే గ్రామానికి చెందిన కె. మునిరెడ్డి మూడు రోజుల క్రితం జేసీబీతో దారికి అడ్డంగా తవ్వించి రాకపోకలు బంద్ చేశాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. దారి సమస్య పరిష్కరించాలని కోరారు. విచారణ చేసి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్, సీఐ గ్రామస్తులకు హామీ తెలిపారు. వినతిపత్రం అందించిన వారిలో సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కె.రవిచంద్రారెడ్డి, ఎంపీటీసీ మహబూబ్ బాషా, మాజీ ఎంపీటీసీ మోదీన్ బాషా, చంద్రశేఖర్, మాజీ కో ఆప్షన్ సభ్యులు మాబూఖాన్, ప్రతాప్‌రెడ్డి, మోదీన్‌బాషా, ఫక్రొద్దీన్ తదితరులు ఉన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న పులగంపల్లి గ్రామస్తులు

శివలింగాన్ని తాకిన సూర్యకిరణాలు



ఎన్‌పీకుంట: సూర్యకిరణాలు శివలింగాన్ని తాకిన అద్భుత దృశ్యం మంగళవారం ఆవిష్కృతమైంది. ఎన్‌పీకుంటలోని శివాలయంలో అర్చకుడు నాగేశ్వరస్వామి వేకువజామున పూజలు నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో ఒక్కసారిగా గర్భగుడిలోని శివలింగాన్ని సూర్యకిరణాలు స్పర్శించాయి. వీటిని చూసిన శివమాలధారులు పరవశించిపోయారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రోగులపై ఆరోగ్య మిత్ర దురుసు ప్రవర్తన

బత్తలపల్లి: ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి ఎంతోమంది వైద్యం కోసం వస్తుంటారు. ఇక్కడ ఆరోగ్యశ్రీ వైద్య సేవలు కూడా అందుబాటులో ఉన్నాయి. ఆరోగ్య సమస్యలతో వచ్చే రోగులకు అండగా ఉండాల్సిన ఆరోగ్యశ్రీ సిబ్బంది దురుసుగా ప్రవర్తిండడం విమర్శలకు తావిస్తోంది. వీరి ప్రవర్తనను చూసి ఆర్డీటీ ఆస్పత్రి సిబ్బంది సైతం విస్తుపోతున్నారు. ఆస్పత్రి ఉన్నతాధికారులు పలుమార్లు హెచ్చరించినా ఆరోగ్యశ్రీ సిబ్బంది పనితీరు మారడం లేదు. సోమవారం పోట్లమర్రి గ్రామానికి చెందిన కుమ్మర ఆదినారాయణ కుమ్మర చక్రం తగిలి కాలు విరిగింది. ఆర్డీటీ ఆస్పత్రికి తీసుకువచ్చిన బంధువులు వైద్యుల సలహా మేరకు ఆరోగ్యశ్రీ రిజిస్ట్రేషన్ కేంద్రం వద్దకు వెళ్లారు. అక్కడ ఆరోగ్య మిత్ర బాలాజీ వారిపై దురుసుగా ప్రవర్తించారు. ఆస్పత్రి సిబ్బంది రావాలి కదా.. మీరెందుకు వచ్చారంటూ చీదరించుకున్నారు. వారే పంపారని చెప్పినా వినలేదు. చివరకు ఇతరులు జోక్యం చేసుకుని చెప్పినా ×మీరు ఎవరైతే నాకేంటి₹ అంటూ నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఆరోగ్య మిత్ర వ్యవహారశైలిపై జిల్లా కో ఆర్డినేటర్ శ్రీదేవి దృష్టికి పలువురు రోగులు ఫిర్యాదు చేసినా.. ఎటువంటి ప్రయోజనమూ లేకపోయింది.

అత్యవసర సమావేశానికి తరలిరండి

కదిరి అర్బన్: ఈ నెల 23న ఎంఆర్‌పీఎస్, ఎంఈఎస్, ఎంఎస్‌పీ ఆధ్వర్యంలో అనంతపురంలోని బళ్లా కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించే అత్యవసర సమావేశానికి మాదిగలంతా తరలిరావాలని మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు నాగేంద్రనాథ్ కోరారు. ఈమేరకు ఆయన మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సమావేశానికి పద్మశ్రీ పురస్కార గ్రహీత మందకృష్ణ మాదిగ హాజరవుతారని పేర్కొన్నారు.

21న జాబ్‌మేళా

కదిరి అర్బన్: పట్టణంలోని ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 21న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ స్మిత మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, బీటెక్, ఎంటెక్ పూర్తి చేసి, 18 నుంచి 30 ఏళ్లలోపు ఉన్న అభ్యర్థులు తమ విద్యార్హతలకు సంబంధించిన ధ్రువపత్రాలతో జాబ్‌మేళాకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ 93901 76421 సెల్ నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

నేడు సబ్సిడీ రుణాల దరఖాస్తుల పరిశీలన

ఓడీచెరువు : సబ్సిడీ రుణాల కోసం చేసుకున్న దరఖాస్తుల పరిశీలన ఈ నెల 19 నుంచి ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాబర్ట్ విల్సన్ తెలిపారు. ఆయా బ్యాంకు మేనేజర్లు విధిగా పాల్గొనాలని కోరారు. దరఖాస్తుదారులు హాజరయ్యేలా చూడాలని సచివాలయ కార్యదర్శులను కోరారు. ఈ నెల 19న ఉదయం తంగేడుకుంట, అల్లాపల్లి పంచాయతీలు సంబంధిత ఏపీజీబీ-గానిపల్లి, మధ్యాహ్నం కొండకమర్ల, చింతమానిపల్లి, డబురువారిపల్లి పంచాయతీలు ఏపీజీబీ-కొండకమర్ల, 20న ఉదయం ఓడీచెరువు, ఇనగలూరు, మిట్టపల్లి, మామిళ్ళకుంట్లపల్లి పంచాయతీలు స్టేట్‌బ్యాంక్- ఓడీచెరువు, మధ్యాహ్నం సున్నంపల్లి, తిప్పేపల్లి, టి.కుంట్లపల్లి, వెంకటాపురం పంచాయతీలు ఏపీజీబీ-ఓడీచెరువు అధికారుల సమక్షంలో దరఖాస్తుల పరిశీలన ఉంటుందని వెల్లడించారు.

తలుపుల : ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు సబ్సిడీ రుణాల మంజూరుకు సంబంధించి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలించనున్నట్లు ఎంపీడీఓ రామానాయక్ తెలిపారు.


పుట్టపర్తి టౌన్: పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలో బీసీ, ఈబీసీ సబ్సిడీ రుణాల కోసం అభ్యర్థులు చేసుకున్న దరఖాస్తులను బుధవారం ఉదయం 10 గంటలకు పరిశీలించనున్నట్లు కమిషనర్ తెలిపారు.

ఎన్‌పీకుంట: బీసీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి బుధవారం ఎన్‌పీకుంట మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అంజినప్ప తెలిపారు.

పకడ్బందీగా భూముల రీసర్వే

తాడిమర్రి: వ్యవసాయ భూముల రీసర్వే పకడ్బందీగా చేపట్టాలని ఆర్డీఓ మహేష్ సిబ్బందిని ఆదేశించారు. ఎం.అగ్రహారంలో జరుగుతున్న భూముల రీసర్వే కార్యక్రమాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. పొలాల వద్దకు వెళ్లి సిబ్బందితో వివరాలు అడిగి తెలుసుకున్నారు. నాలుగు టీమ్‌లు ఏర్పాటు చేసి గ్రామంలో రీసర్వే చేయిస్తున్నట్లు తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి ఆయనకు వివరించారు. అనంతరం ఆయన పుట్టపర్తిలోని గ్రీవెన్స్‌లో ఇటీవల అర్జీ ఇచ్చిన రైతు కుళ్లాయప్పతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. తర్వాత తాడిమర్రి సమీపంలో ముస్లిం శ్మశాన వాటిక పక్కన గత ప్రభుత్వం పేదల కోసం ఏర్పాటు చేసిన లేఅవుట్లను పరిశీలించారు. అటు నుంచి స్టేట్‌బ్యాంక్ వెనుక బీసీ పాఠశాల ఆవరణలో గల అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆర్డీఓ సందర్శించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ నిశాంతి, వీఆర్‌ఓ రాముడు తదితరులు పాల్గొన్నారు.

కొత్తిమీర.. లాభాలు తనివితీర



పెద్దకోట్లపల్లి వద్ద సాగుచేసిన కొత్తిమీర పంట

నల్లమాడ: ఏ వంటకమైనా ఘుమఘుమలాడాలంటే కొత్తిమీర వేయాల్సిందే. ఇది ఆరోగ్యానికి ఎంతో మంచిది. అలాంటి కొత్తిమీర పంట సాగు రైతు లాభదాయకంగా మారుతోంది. స్వల్ప పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించి మంచి ఆదాయం పొందవచ్చు. సమీపంలోని కర్ణాటక రాష్ట్రం బాగేపల్లి నుంచి మనకు కొత్తిమీర ఎక్కువగా దిగుమతి అవుతుంటుంది. అక్కడ కొనుగోలు చేసి ఇక్కడి వారపు సంతల్లో విక్రయిస్తుంటారు. ఆటోల్లోనూ అమ్ముతుంటారు. ఇటీవల పుట్టపర్తి నియోజకవర్గంలో కొత్తిమీర సాగు వైపు పలువురు రైతులు మొగ్గుచూపుతున్నారు. బోరుబావుల కింద కొంత భూములున్న రైతులు కొంత విస్తీర్ణంలో అయినా సరే కొత్తిమీర సాగు చేస్తున్నారు. కొత్తిమీర సాగు కోసం ఎకరాకు 26 కిలోల ధనియాలు అవసరమవుతాయి. విత్తనం చల్లిన అనంతరం సేద్యం చేస్తారు. మూడు రోజుల తర్వాత గడ్డి నివారణ మందు పిచికారీ చేస్తారు. పంటలో కలుపు తొలగించే అవసరం ఉండదు. నెల రోజులకే పంట కోతకు వస్తుంది. అనంతపురం, హిందూపురం, కదిరితో పాటు చుట్టుపక్కల ప్రాంతాల వ్యాపారులు తోటల వద్దకే వచ్చి కొత్తి మీర కొనుగోలు చేస్తారు. కిలో కొత్తిమీర రూ.50 నుంచి రూ.80 వరకు పలుకుతోంది. కట్టల ప్రకారం ఒకటి రూ.10 చొప్పున విక్రయిస్తున్నారు.

సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం కావాలి



కొత్తమీర సాగు రైతుకు లాభదాయకం. నేను బాగేపల్లికి వెళ్లి అక్కడ కొత్తమీర పంటను పరిశీలించి, అక్కడి రైతులతో మాట్లాడిన తరువాత సాగు చేశాను. కొత్తమీరకు క్రిమి సంహారక మందులు పెద్దగా పిచికారీ చేయాల్సిన అవసరం ఉండదు. నేను సాగుచేసిన తర్వాత మా గ్రామంలో మరికొందరు రైతులు కొత్తమీర సాగుకు ముందుకొచ్చారు. నేను ఒకటిన్నర ఎకరం పంట పెడితే.. ఖర్చులు పోను రూ.లక్ష దాకా ఆదాయం వచ్చింది. మార్చి నుంచి ఆగస్టు వరకు హైబ్రీడ్, సెప్టెంబర్ నుంచి ఫిబ్రవరి వరకు నాటీ రకం కొత్తమీర సాగు మంచి లాభాలనిస్తాయి. ప్రభుత్వం కూడా విత్తనాలు, ఎరువులు, మందులను సబ్సిడీపై అందించి కొత్తమీర సాగును ప్రోత్సహించాలి.

– విశ్వనాథరెడ్డి, రైతు, పెద్దకోట్లపల్లి, నల్లమాడ మండలం